# అయినోళ్లు, ఉన్నోళ్లకే ఇండ్లా..?

- నిరుపేదలకు మొండి 'చేయి' చూపడంపై ఆగ్రహం
- ఇందిరమ్మ కమిటీలు కాంగ్రెస్ కమిటీలు అంటూ ఆరోపణ
- సర్వేకు వెళ్లిన అధికారులను ఎక్కడికక్కడ నిలదీసిన ప్రజలు

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల సర్వేకు వెళ్లిన అధికారులకు నిరసనలు, నిలదీతలు ఎదురయ్యాయి. ఇందిరమ్మ ఇండ్ల కమిటీలు, అధికారులతో వెళ్లిన వారిని అర్హులైన నిరుపేదలు ఎక్కడికక్కడ ప్రశ్నిస్తూ అడ్డుకున్నారు. ఇందిరమ్మ ఇండ్ల కమిటీలు కాంగ్రెస్ కమిటీలు అయ్యాయని, అయినోళ్లు, ఉన్నోళ్లకే ఇండ్లా అంటూ.. నిరుపేదలు మండిపడ్డారు. తిరుమలాయపాలెం, కరకగూడెం, బోనకల్లు, ఇల్లెందు పట్టణాల్లో దరఖాస్తుదారులు నిరసన వ్యక్తం చేయడంతోపాటు ఆందోళనలు చేశారు. ప్రభుత్వం, అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. చేసేది లేక అధికారులు వెనుదిరిగారు.



తిరుమలాయపాలెం : బచ్చోడు పంచాయతీ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న ఇండ్లు మంజూరు కాని మహిళలు

### బచ్చోడు జీపీకి తాళం వేసి మహిళల ఆందోళన

**ధనికులు, భూములున్న వారికి ఇళ్లు ఇచ్చారని ఆరోపణ**

తిరుమలాయపాలెం, ఏప్రిల్ 30 : ఇందిరమ్మ కమిటీలు ధనికులు, భూములు ఉన్న వారికి, కాంగ్రెస్ కార్యకర్తలకు ఇండ్లు మంజూరు చేశారని ఆరోపిస్తూ పలువురు మహిళలు తిరుమలాయపాలె మండలం బచ్చోడు గ్రామపంచాయతీ కార్యాలయానికి తాళం వేసి బుధవారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గుడిసెలు, రేకుల ఇళ్లు ఉన్న వారికి ఇండ్లు ఇవ్వకుండా ధనికులకే ఇండ్లు మంజూరు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇందిరమ్మ కమిటీలు కాంగ్రెస్ కమిటీలుగా మారాయని, వెంటనే వాటిని రద్దు చేసి అర్హులైన నిరుపేదలకు ఇండ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దారమళ్ల రాణి, నందిపాటి రేణుక, జిల్లా నాగమణి, గొర్రెపాటి ధనలక్ష్మి, నందిపాటి ప్రశాంతి, గొర్రెపాటి కుమారి, స్వరూప, సీపీఐ(ఎంఎల్) న్యూడమోక్రసీ మండల కార్యదర్శి గొర్రెపాటి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

### చొప్పాల గ్రామస్తుల నిరసన

కరకగూడెం, ఏప్రిల్ 30 : అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని, అనర్హులకు ఒక్క ఇల్లు ఇచ్చినా ఊర్కునేది లేదని హెచ్చరిస్తూ కరకగూడెం మండలం చొప్పాల గ్రామస్తులు బుధవారం నిరసన తెలిపారు. చొప్పాల పంచాయతీ పరిధిలో 24 మందికి ఇండ్లు మంజూరయ్యాయని సర్వేకు వచ్చిన అధికారులు గ్రామస్తులకు వివరించారు. దీంతో అర్హులను పక్కన పెట్టి.. భూములు, ఉద్యోగాలు ఉన్న వారికి ఇండ్లు ఎలా మంజూరు చేశారంటూ వాగ్వాదానికి దిగారు. సెంటు భూమి లేని వారిని గుర్తించి ఇండ్లు మంజూరు చేయాలని ఆందోళనకు దిగారు. ఉద్యోగాలు, పొలాలు ఉన్న వారికి ఏం తక్కువైందని జాబితాలో వారి పేర్లను చేర్చారని అధికారులను నిలదీశారు. గ్రామస్తులు అధికారులను చట్టుముట్టడంతో అక్కడి నుంచి వారు వెళ్లిపోయారు. ఇందిరమ్మ కమిటీ సభ్యులు ఏవిధంగా అర్హులను గుర్తించారని గ్రామస్తులు మండిపడ్డారు. దీనిపై కలెక్టర్ కార్యాలయానికి వెళ్లి ఫిర్యాదు చేస్తామని గ్రామస్తులు చెప్పారు.



కరకగూడెం : చొప్పాలలో ఇండ్లు కేటాయించాలని నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

## ఎమ్మెల్యే జారేను అడ్డుకున్న గిరిజనులు

- ఇందిరమ్మ ఇళ్లు ఏమయ్యాయని నిలదీత
- గిరిజనేతరులకు ఇచ్చారని ఆగ్రహం
- నారాయణపురం పంచాయతీలో నిరసన సెగ



అశ్వారావుపేట మండలంలో ఎమ్మెల్యే జారే ఆదినారాయణను అడ్డుకుంటున్న గిరిజనులు

అశ్వారావుపేట రూరల్, ఏప్రిల్ 30 : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలంలోని సూరంపేట, నెమలిపేట, పెంచికలపాడు, జగన్నాధపురం గ్రామాల గిరిజనులు అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణను అడ్డుకున్నారు. బుధవారం చెరువుబాట కార్యక్రమంలో భాగంగా నారాయణపురం గ్రామ పంచాయతీలోని జగన్నాధపురం గ్రామ చెరువు మరమ్మతు పనుల ప్రారంభానికి వెళ్తున్న ఎమ్మెల్యేను ఈ నాలుగు గ్రామాల గిరిజనులు ఇందిరమ్మ ఇళ్ల విషయంపై నిలదీశారు. గిరిజనులందరం పూరిగుడిసెల్లో నివసిస్తున్నామని, తమకు ఇళ్లు మంజూరు చేయాలని గిరిజన మహిళలు డిమాండ్ చేశారు. నారాయణపురం గ్రామ పంచాయతీలోని మొత్తం ఐదు గ్రామాలకు గాను 47 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా మా నాలుగు గిరిజన గ్రామాలకు 15 మాత్రమే గృహాలు ఇచ్చి మిగిలిన 32 నారాయణపురంలో గిరిజనేతరులకు మంజూరు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందిరమ్మ కమిటీ ఏ గ్రామంలోనూ గ్రామసభలు జరపలేదని, కనీసం మా గ్రామాలకు ఎన్ని ఇళ్లు వచ్చింది కూడా పంచాయతీ కార్యదర్శి, ఇందిరమ్మ కమిటీ సభ్యులు చెప్పడం లేదని ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. ఏకపక్షంగా లబ్ధిదారుల ఎంపిక జరిగిందని, దానిని రద్దు చేసి అర్హులకు మాత్రమే ఇళ్లు కేటాయించాలని ఎమ్మెల్యేను కోరారు. రిజర్వేషన్ల ప్రకారం 50శాతం ఇళ్లు గిరిజనులకు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐబీ డీఈఈ కృష్ణ, ఏఈ కృష్ణమూర్తి, నాయకులు జూపల్లి రమేష్‌బాబు, డీసీసీబీ డైరెక్టర్ నిర్మల పుల్లారావు, ప్రమోద్, చందా సతీష్, ఆకుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### ఇండ్ల కోసం జీపీ ఎదుట ఆందోళన



బోనకల్లు : గోవిందాపురం(ఎల్) పంచాయతీ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న దరఖాస్తుదారులు

బోనకల్లు, ఏప్రిల్ 30 : అర్హులందరికీ ఇళ్లు మంజూరు చేస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం ఆ పార్టీ నాయకులనే ఇళ్లు మంజూరు చేయడంపై ఆగ్రహిస్తూ ఖమ్మం జిల్లా బోనకల్లు మండలం గోవిందాపురం-ఎల్ గ్రామస్తులు గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట బుధవారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు పలువురు, సీపీఎం నాయకులు నల్లమోతు వాణి, తమ్మారపు లక్ష్మణరావు మాట్లాడుతూ గ్రామానికి మంజూరైన 24 ఇళ్లకు ఇందిరమ్మ కమిటీ సభ్యులు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ఉన్నత వర్గాలకు చెందిన వారిని రహస్యంగా ఎంపిక చేశారని ఆరోపించారు. తాము పూరి గుడిసెలు, రేకుల షెడ్లలో ఉంటూ అర్హులమైనప్పటికీ ఇండ్లు ఎందుకు మంజూరు చేయలేదని పంచాయతీ కార్యదర్శి మురళిని నిలదీశారు. ప్రజా పాలన పేరుతో ప్రజలను మోసం చేయాలని చూస్తే మనుగడ సాగించలేరని, ప్రజలే వారికి తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. అనంతరం కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పసుపులేటి నరేశ్, జొన్నలగడ్డ సునీత, కల్యాణపు శ్రీనివాసరావు, యాదయ్య, సైదాబి, వలరాజు తదితరులు పాల్గొన్నారు.

### ఇల్లెందులో అధికారుల నిలదీత

ఇల్లెందు, ఏప్రిల్ 30 : నిరుపేదలమైన తమకు ఇండ్లు ఇవ్వకుండా.. కాంగ్రెస్ నాయకులకు మాత్రమే ఇండ్లు మంజూరు చేయడంపై భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు మున్సిపాలిటీ పరిధి 3వ వార్డుకు చెందిన ప్రజలు బుధవారం ఇందిరమ్మ కమిటీ సభ్యులు, అధికారులను నిలదీశారు. సర్వేకు వచ్చిన అధికారులు వార్డులో 72 మంది ఉండగా.. అందులో నిరుపేదలైన 13 మందికి ఇండ్లు మంజూరైనట్లు తెలిపారు. దీంతో నిరుపేదలకు ఇండ్లు ఇవ్వకుండా.. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు, ధనవంతులకు ఎలా మంజూరు చేశారని ప్రశ్నించడంతో అధికారులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. అనంతరం కాంగ్రెస్ నాయకులు, ఇందిరమ్మ కమిటీ సభ్యుల మధ్య ఇండ్ల కేటాయింపుపై గొడవ జరిగింది. ఇల్లు మంజూరుకు రూ.లక్ష తీసుకున్నాను.. ఎవరేం చేస్తారో చేసుకోండి అంటూ పరస్పరం దూషించుకున్నారు.



ఇల్లెందులో ఇండ్ల కోసం అధికారులను నిలదీస్తున్న నిరుపేదలు

### సర్టిఫికెట్ల పరిశీలన

భద్రాచలం, ఏప్రిల్ 30 : బడి ఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించేందుకు ఉపాధ్యాయులను అకడమిక్ కమ్యూనిటీ మొబలైజేషన్ ఆఫీసర్ పోస్టుకు ఎంపిక చేయనున్నట్లు ఐటీడీఏ పీవో రాహుల్ తెలిపారు. ఈ పోస్టు కోసం దరఖాస్తు చేసుకున్న ఉపాధ్యాయుల సర్టిఫికెట్లను బుధవారం తన చాంబర్‌లో పీవో పరిశీలించారు. డీడీ మణెమ్మ, ఏసీఎంవో రమణయ్య, ఖమ్మం డీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ, ఎంఈవో రమ పాల్గొన్నారు.



సర్టిఫికెట్లను పరిశీలిస్తున్న పీవో రాహుల్

### 'రైతులను మోసం చేస్తే సహించం'

భద్రాచలం, ఏప్రిల్ 30 : మండలంలో రైతులు, వ్యవసాయ కార్మికులు ఎప్పుడూ లేనివిధంగా సమస్యలు ఎదుర్కొంటున్నారని, దీనికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పాలకులు కారణమని ఆలిండియా యునైటెడ్ కిసాన్ సభ జాతీయ కన్వీనర్ కెచ్చెల రంగారెడ్డి ఆరోపించారు. బుధవారం భద్రాచలంలో జరిగిన ఐక్య రైతుసంఘం ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం మండలస్థాయి మహాసభల్లో ఆయన మాట్లాడారు. రైతాంగానికి సరైన గిట్టుబాటు ధరలేక ఆదాయాలు పెరగక ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, వ్యవసాయాలను వీడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మునిగెల శివప్రశాంత్, కాలం సుక్కయ్య 9మంది సభ్యులతో రైతుసంఘం డివిజన్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. డివిజన్ కార్యదర్శిగా మడకం భీమరాజు, దాసరి సాయి అధ్యక్షులుగా కల్లూరి శంకర్, పాలెం సుక్కమ్మతోపాటు మరో ఏడుగురితో కమిటీని ఎన్నుకున్నారు. ఈ మహాసభలో సమిడి సుజాత, కణితి శాంత, పీవోడబ్ల్యు డివిజన్ అధ్యక్షురాలు మునిగెల మహేశ్వరి, సరళ, మడకం విడమరాజు, షకీరా, శాంతక్క పాల్గొన్నారు.

### వరకట్నం కోసం వేధిస్తున్నారు..

భద్రాచలం, ఏప్రిల్ 30 : భర్త, అత్త, ఆడబిడ్డలు కలిసి వరకట్నం కోసం తనను వేధిస్తున్నారంటూ ఓ గిరిజన మహిళ భద్రాచలం మనుబోతుల కాలనీలో భర్త ఇంటి ఎదుట బుధవారం మండుటెండలో ఆందోళనకు దిగింది. పట్టణానికి చెందిన రాజేశ్వరి కొన్నేళ్ల క్రితం మనుబోతుల కాలనీకి చెందిన వ్యక్తిని వివాహం చేసుకుంది. ఇద్దరు పిల్లలు కూడా ఉన్నారు. తనకు న్యాయం చేయాలని పోలీసులను వేడుకున్నది.

## సీఎం సారూ.. ఆనాటి హామీ ఏమాయే?

**అర్హత ఉన్నా దక్కని ఇందిరమ్మ ఇల్లు**

**ఓ దివ్యాంగురాలి ఆవేదన**



మాట్లాడుతున్న ధరావత్ కైలాస్ బాయి

ఇల్లెందు, ఏప్రిల్ 30 : సాక్షాత్తూ రేవంత్‌రెడ్డి మాట ఇచ్చినా.. అన్ని అర్హతలు ఉన్నా తనకు ఇందిరమ్మ ఇల్లు కాలేదని ఓ దివ్యాంగురాలు ఆవేదన వ్యక్తం చేస్తోంది. ఇల్లెందు పట్టణంలోని నిర్వాసితుల కాలనీలో నివాసం ఉంటున్న దివ్యాంగురాలు ధరావత్ కైలాస్ బాయ్‌తో గత అంసెబ్లీ ఎన్నికల సమయంలో ఇల్లెందుకు వచ్చిన రేవంత్‌రెడ్డి, సీతక్కలు మాట్లాడారు. ప్రచారంలో భాగంగా వచ్చిన వారు కైలాస్‌బాయికు ఏమికావాలని అడిగారు.. నాకు ఇల్లు కావాలని ఆమె చెప్పడంతో వచ్చే ది కాంగ్రెస్ ప్రభుత్వమే నీకు తప్పకుండా ఇల్లు ఇస్తామని భరోసానిచ్చారు. కానీ ఇందిరమ్మ తొలి జాబితాలో కైలాస్‌బాయ్ పేరు రాలేదు. దీంతో తనకు న్యాయం చేయాలని ఆ దివ్యాంగురాలు చేతులెత్తి కోరుతున్నది.

**మావోయిస్టుల కోటలో డ్రోన్లతో భద్రతా దళాల వేట**

**శాంతి చర్చలకు సిద్ధమని మావోయిస్టులు ప్రకటించినా ఆగని 'కగార్'**

**అడవులను 'జూమ్' చేస్తున్న బలగాలు**

## 'గుట్ట'పై పట్టు..!

కొత్తగూడెం ప్రగతి మైదాన్, ఏప్రిల్ 30 : మావోయిస్టుల కోసం కర్రెగుట్ట అడవుల్లో భద్రతా దళాలు జల్లెడపడుతున్నాయి. ఆపరేషన్ 'కగార్' పేరుతో అధునాతన పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ అణువణువూ గాలింపు చర్యలు ముమ్మరం చేశాయి. శాంతి చర్చలకు తాము సిద్ధమంటూ మావోయిస్టు నేతలు ప్రకటనలు విడుదల చేసినా.. యుద్ధం ఆపేది లేదంటూ దూకుడు పెంచాయి భద్రతా దళాలు. వివరాల్లోకి వెళితే.. తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దు ములుగు-బీజాపూర్ జిల్లాల్లో విస్తరించి ఉన్న కర్రెగుట్టల్లో మావోయిస్టుల కోసం రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల పోలీస్ బలగాలు పది రోజులుగా అలుపెరుగకుండా గాలింపు చర్యలు చేపట్టాయి. ఈ నేపథ్యంలో మావోయిస్టు నేతలు నార్త్-వెస్ట్ జోన్ బ్యూరో రూపేష్, కేంద్ర కమిటీ అధికార ప్రతినిధి అభయ్ పేర్లతో తమ పార్టీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో శాంతి చర్చలకు సిద్ధంగా ఉందంటూ మూడు విడతలుగా లేఖలు విడుదల చేసిన విషయం తెలిసిందే. కాల్పుల విరమణకు నెల రోజుల వ్యవధి కావాలంటూ లేఖలో పేర్కొన్న విషయం విదితమే. అయితే మావోయిస్టులు ఏడాది కాలంగా శాంతి చర్చలకు తాము సిద్ధంగా ఉన్నామంటూ లేఖలు విడుదల చేసినప్పటికీ కేంద్ర ప్రభుత్వం మావోయిస్టు కార్యకలాపాలను నిర్మూలించేందుకు అవిశ్రాంత ఆపరేషన్లు కొనసాగిస్తూనే ఉంది. ఈ క్రమంలో నెల రోజుల వ్యవధిలోనే జార్ఖండ్ రాష్ట్రం బోకారో జిల్లాలో జరిగిన ఎదురుకాల్పుల్లో కేంద్ర కమిటీ సభ్యుడు, మావోయిస్టు పార్టీ కీలక నేత వివేక్‌తో సహా 8 మంది మృతిచెందగా.. పది రోజులుగా కర్రెగుట్టల్లో చేపట్టిన ఆపరేషన్ 'కగార్'లో భాగంగా ఆరుగురు మావోయిస్టులు మృతిచెందారు. ఈ రెండు ఎదురుకాల్పుల్లో మొత్తం 12 మంది మావోయిస్టులు మృతిచెందగా.. అందులో ఏడుగురు కీలక సభ్యులు ఉన్నట్లు తెలుస్తోంది.

**కర్రెగుట్టలను వశం చేసుకునేందుకే..**

అపారమైన ఖనిజ సంపదకు నెలవైన కర్రెగుట్టల్లో దట్టమైన గుట్టలతోపాటు విస్తారమైన అటవీ ప్రాంతం నెలకొని ఉంది. బీజాపూర్-నారాయణ్‌పూర్ జిల్లాల సరిహద్దుల్లో ఉన్న అబూజ్‌మడ్ అటవీ ప్రాంతాన్ని గతేడాది వరకు మావోయిస్టులు కేంద్రంగా చేసుకుని వ్యూహాలు రచించారు. కాగా.. బీజేపీ డబులింజన్ సర్కార్ ఏడాది కాలంగా చేపడుతున్న ఆపరేషన్ 'కగార్'తో అబూజ్‌మడ్ ప్రాంతం పూర్తిగా రాష్ట్ర, కేంద్ర బలగాల స్వాధీనంలోకి వచ్చేసినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో ఆ ప్రాంతంలో నెలకొన్న మావోయిస్టులకు చెందిన బంకర్లు, సొరంగ మార్గాలు, ఆయుధ కర్మాగారాలు, మందుపాతర తయారీ కేంద్రాలను భద్రతా దళాలు ధ్వంసం చేశాయి. మావోయిస్టులకు అబూజ్‌మడ్ పట్టుజారడంతో తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో సుమారు 80 కిలోమీటర్ల విస్తీర్ణంలో విస్తరించి ఉన్న కర్రెగుట్టల ప్రాంతంలో మావోయిస్టులు తలదాచుకున్నారు. ప్రస్తుతం మావోయిస్టు పార్టీకి చెందిన తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి బడే చొక్కారావు అలియాస్ దామోదర్, పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ(పీఎల్‌జీఏ) చీఫ్, కేంద్ర కమిటీ సభ్యుడు మడివి హద్మా అలియాస్ హిద్మాలు అలియాస్ సంతోష్‌తోపాటు మరికొందరు కీలక నేతలు కర్రెగుట్టల్లోనే ఉన్నట్లు కేంద్ర ప్రభుత్వానికి సమాచారం అందింది. దీంతో ఇదే అదునుగా ఈ ఆపరేషన్ ప్రారంభించినట్లు తెలుస్తోంది. సుమారు 1,500 మంది సాయుధ మావోయిస్టులు తలదాచుకున్న కర్రెగుట్టలను దాదాపు 15 వేల మంది కేంద్ర, రాష్ట్ర సాయుధ బలగాలు ఏక కాలంలో చుట్టుముట్టి ఈ ఆపరేషన్ కొనసాగిస్తున్నాయి.

**డ్రోన్లతో వేట..**

మావోయిస్టులు తలదాచుకున్న కర్రెగుట్టల ప్రాంతాన్ని ఇప్పటికే కేంద్ర బలగాలు దాదాపుగా తమ ఆధీనంలోకి తీసుకున్నాయి. ఈ నేపథ్యంలో భద్రతా దళాలు బుధవారం కర్రెగుట్టలపై జాతీయ జెండాను ఎగురవేశాయి. ఇదిలా ఉండగా.. మావోయిస్టుల కోసం విస్తృతంగా గాలిస్తున్న భద్రతా దళాలు ఉపగ్రహ ఛాయాచిత్రాల చిత్రీకరణతోపాటు డ్రోన్లతో సైతం దండకారణ్యంలో వేట మొదలుపెట్టినట్లు తెలుస్తోంది. మావోయిస్టులను గుర్తించేందుకు అధునాతన పరిజ్ఞానంతో కూడిన 'డీప్ జూమ్ లెన్స్'లతో డ్రోన్ విజువల్స్‌ని సేకరిస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే కర్రెగుట్టల్లోని తడపాల, డోలి, జల్ల, ముక్కునూరు, నడిపల్లి, కోడిజుట్టుగుట్ట, లోదేడు, అన్నారం ప్రాంతాలను భద్రతా బలగాలు తమ అధీనంలోకి తీసుకున్నాయి. ఆ ప్రాంతంలో ఒక్కో గుట్ట సుమారు 300 నుంచి 800 మీటర్ల ఎత్తులో ఉండడంతోపాటు దట్టమైన అటవీ మార్గం కావడంతో మావోయిస్టులు తలదాచుకునేందుకు అనువైన ప్రాంతంగా మారింది. కాగా.. ఈ డ్రోన్లు మనుషులను గుర్తించేందుకు వీలుగా వివిధ పరిస్థితుల్లో శోధన, రక్షణ కార్యకలాపాల్లో భాగంగా కృత్రిమ మేధస్సు, అల్గారిథమ్‌తోపాటు తరచుగా థర్మల్, ఇన్‌ఫ్రారెడ్ కెమెరాలతోపాటు కెమెరాలు సెన్సార్ కలయికతో ఉంటాయి. ఈ మేరకే డ్రోన్ల వినియోగంతో అడవుల్లో గాలింపులను మరింత ముమ్మరం చేసినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం.




### మాజీ ఎమ్మెల్యే మెచ్చా పర్యటన

దమ్మపేట, ఏప్రిల్ 30 : మండలంలో మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు బుధవారం పర్యటించారు. గండుగలపల్లిలోని శ్రీనాగళ్ల ముత్యాలమ్మ, శ్రీకనక దుర్గమ్మ అమ్మవార్ల తిరునాళ్ల మహోత్సవంలో పాల్గొని అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆయన్ని శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో తుమ్మల లక్ష్మణ్‌రావు, అప్పాని రమేష్, నరకుళ్ల రామారావు, మార్కుల చిన్నారావు, ఎలమంచి చిట్టిబాబు, నాగేంద్ర, ఎర్ర వసంతరావు, ఓబుల సత్యనారాయణ, కాసాని ప్రసాద్, షేక్ లాలు, భరత్, దారా రాము, కండవెల్లి రాజు పాల్గొన్నారు.

### సెక్యూరిటీ చెక్‌పోస్ట్ ప్రారంభం

ఇల్లెందురూరల్, ఏప్రిల్ 30 : ఇల్లెందు ఏరియాలోని కరెంట్ ఆఫీస్ ఖమ్మంరోడ్డులో సెక్యూరిటీ చెక్‌పోస్ట్‌ను సింగరేణి ఏరియా జీఎం వి.కృష్ణయ్య బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోయగూడెం నుంచి ఇల్లెందు సీహెచ్‌పీ బొగ్గు రవాణా చేయు టిప్పర్, బాడీలారీలను తనిఖీ చేయడంలో సెక్యూరిటీ సిబ్బంది అనుగుణంగా చెక్‌పోస్ట్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

### బీఆర్‌ఎస్ నాయకుల సంతాపం

మణుగూరు టౌన్, ఏప్రిల్ 30 : మండలంలోని దమ్మక్కపేట గ్రామానికి చెందిన ప్రముఖ సీనియర్ జర్నలిస్టు బిల్లా సీతారాములు తల్లి మంగమ్మ మృతి చెందారు. విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ నాయకులు ఆమె మృతదేహాన్ని సందర్శించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కుర్రి నాగేశ్వరరావు, కుంటా లక్ష్మణ్, ఎడవల్లి వెంకటయ్య, ఆవుల నరసింహారావు, వేల్పుల సురేష్, కృష్ణ, వెంకటేశ్వర్లు, స్వరూప, విజయ్, మహేష్, సత్యనారాయణ ఉన్నారు.

### ఎమ్మెల్యేను కలిసిన గ్రామస్తులు

మణుగూరు టౌన్, ఏప్రిల్ 30 : మండలంలోని రాజుపేట, విఠల్‌రావు నగర్, పీకే వన్, బాపనగుంట గ్రామాల్లో బ్లాస్టింగ్‌తో ఇళ్లు దెబ్బతిన్నాయని ఆయా గ్రామాల ప్రజలు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లును బుధవారం కలిసి విజ్ఞప్తి చేశారు. కలెక్టర్, అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిహారం ఇప్పించాలని కోరారు.

### లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా ఉండాలి

ఇల్లెందు, ఏప్రిల్ 30 : రాజీవ్ యువ వికాసం పథకంలో ట్రైకార్ ఎస్టీ రుణాల ఎంపిక పారదర్శకంగా నిర్వహించాలని మున్సిపల్ కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్ అన్నారు. బుధవారం ఇల్లెందు పట్టణానికి చెందిన 154మంది దరఖాస్తుదారులతో మెప్మా కార్యాలయంలో ముఖాముఖి నిర్వహించగా 110 మంది హాజరయ్యారు. వారిలో 83మందికి తొలి విడతలో అవకాశం ఉంటుందని, మొత్తం ప్రక్రియ పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

